# కాంగ్రెస్‌ది ఆంక్షల పాలన

- మహానీయుల చరిత్ర తెలియకుండా పోలీసుల యాక్టు అమలు చేయడమేంటి?
- దీక్షాపరులు గ్రామగ్రామాన మహనీయుల చరిత్రను చాటి చెప్పాలి
- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్




మంథనిలో పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

రామగిరి/మంథని, ఏప్రిల్ 11: ప్రజాపాలన కొనసాగి స్తున్నామని చెప్పు కొంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ఆంక్షల పాలన అమలు చేస్తున్నదని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఎద్దేవా చేశారు. మహనీయుల ఉత్సవాలు జరుపుకోకుండా పోలీస్ యాక్ట్ అమలు చేయడమేంటని ప్రశ్నించారు. రాష్ట్రం ఏర్పాటు కాకముందు కాంగ్రెస్ హయాంలో ఎలాంటి పరిస్థితులు ఉండేవో.. ఇప్పుడే అవే పరిస్థితులు మళ్లీ వచ్చాయన్నారు. ప్రతిపక్ష నాయకుడిగా పోరాటం చేస్తుంటే.. తమ గొంతునొక్కే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి, మంథనిలో స్థానిక ఎమ్మెల్యే దోపిడీ పాలన చేస్తున్నారని మండిపడ్డారు. సామాజిక, సాంఘిక విప్లవకా రుడు జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. పుట్ట మధూకర్ తన నివాసం నుంచి బీఆర్ఎస్ నాయకులతో ర్యాలీగా పూలే విగ్రహం వరకు చేరుకున్నారు. అనంతరం పూలే విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. తర్వాత బీఆర్ఎస్ నాయకులతో కలిసి మహానీయుల దీక్ష చేపట్టి, మాట్లాడారు. ప్రతి ఒక్కరికి మహానీయుల చరిత్ర తెలియజేయాలనే ఉద్దేశంతో మహానీయుల స్ఫూర్తి దీక్షను తీసుకున్నట్లు తెలిపారు. ఈ నెల 14న అంబేద్కర్ జయంతి వరకు ఈ దీక్షను కొనసాగిస్తామన్నారు. ప్రత్యేక డ్రెస్ కోడ్‌లోనే ఉంటూ ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. గతేడాది 15మందితో ప్రారంభమైన ఈ దీక్ష.. ఈ సారి రెట్టింపు మంది చేపట్టారన్నారు. దేశంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సమాజానికి విద్యాదానం చేసిన గొప్ప వ్యక్తి మహాత్మా పూలే అని కొనియడారు. అట్టడుగు వర్గాల కోసం పూలే తన కుటుంబాన్ని త్యాగం చేస్తే.. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తన కుమారుడు చనిపోయాడని తెలిసినా సమాజం కోసం వాదించాడన్నారు. అలాంటి మహనీయుల త్యాగాలను తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ కోసం కేసీఆర్ పోరాటం మొదలు పెట్టి రాష్ట్రాన్ని ఎలా సాధించుకున్నారో అదే తరహాలో నియోజకవర్గంలో చరిత్రను సృష్టించే చరిత్రకారులు తయారుకావాలన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో మాత్రం హక్కుల కోసం శాంతియుతంగా రోడ్లపైకి వచ్చి మాట్లాడితేనే కేసులు పెడుతున్నారని ఇదెక్కడి న్యాయమన్నారు. మహనీయుల దీక్ష స్వీకరించినవారు గ్రామగ్రామాన వెళ్లి మహనీయుల ఆశయాలు, ఆలోచన విధానాలపై ప్రజల్లో అవగాహన పెంచాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జక్కు రాకేశ్, తగరం శంకర్‌లాల్, ఎగోలపు శంకర్‌గౌడ్, ఆరెపల్లి కుమార్, పూదరి సత్యనారాయణ, ఎస్‌కే యాకుబ్, మాచీడి రాజు గౌడ్, గొబ్బూరి వంశీ, కారెంగుల సుధాకర్, పుప్పాల తిరుపతి, కొవ్వూరి శ్రీకర్, ఆకుల రాజబాబు, అత్తె చంద్రమౌళి, శంకెసి రవీందర్, తాజొద్దీన్ పాల్గొన్నారు. రామగిరి మండల బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సెంటినరీ కాలనీలో జోతిరావుపూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శంకెసి రవీందర్, నాయకులు సత్యనారాయణ గౌడ్, నాగెల్లి సాంబయ్య, కాపురబోయిన భాస్కర్, దామెర శ్రీనివాస్, గందం శ్రీనివాస్, మోడగోని రాజన్న, రోడ్డ శ్రీనివాస్, మట్ట రాజు పాల్గొన్నారు.

## పూలే గొప్ప సంఘ సంస్కర్త

- మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్



గోదావరిఖని: నివాళులర్పిస్తున్న కోరుకంటి చందర్

గోదావరిఖని/ కోల్‌సిటీ, ఏప్రిల్ 11 : అణగారిన వర్గాల విద్యాభివృద్ధి కోసం కృషిచేసిన గొప్ప సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే అని రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. పూలే జయంతి సందర్భంగా స్థానిక రాజేశ్ టాకీస్ ఏరియా, మార్కండేయ కాలనీ జంక్షన్‌లోని ఆయన విగ్రహాలకు పూలమాల వేసి ఘన నివాళులర్పించి మాట్లాడారు. సామాజిక అసమానతలపై అలుపెరుగదని పోరాటం చేసి, అణగారిన వర్గాల విద్యాభివృద్ధి కృషి చేసిన మహానుభావుడన్నారు. అందరికీ సమాన విద్య కోసం పరితపించిన మహనీయుడు పూలే అని కొనియాడారు. కుల వ్యవస్థను వ్యతిరేకించారని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకవెళ్లడమే ఆయనకు నిజమైన నివాళి అని అన్నారు. మాజీ మంత్రి కేటీఆర్ ఆదేశాలతో గతంలో పూలే విగ్రహాలను ఏర్పాటు చేసినట్లు గుర్తు చేశారు. ఇక్కడ బీఆర్ఎస్ నాయకులు నడిపెల్లి మురళీధర్‌రావు, మాజీ కార్పొరేటర్లు పెంట రాజేశ్, కుమ్మరి శ్రీనివాస్, నాయకులుపాల్గొన్నారు.

## ఆశయ సాధనకు కృషి చేయాలి

- మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి

పెద్దపల్లి టౌన్, ఏప్రిల్11: మహాత్మా జ్యోతిబా పూలే గొప్ప సంఘ సంస్కర్త అని పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి కొనియాడారు. పూలే జయంతిని పురస్కరించుకుని శుక్రవారం జిల్లా కేంద్రంలోని అమర్‌నగర్ చౌరస్తాలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ, స్త్రీలకు పురుషులతో సమాన హక్కులు ఉండాలని, చదువులోని భాగస్వాములు కావాలని బలంగా నమ్మిన గొప్ప వ్యక్తి జ్యోతిబా పూలే అని అన్నారు. మహిళలకు దేశంలోనే మొదటి బాలిక పాఠశాల ప్రారంభించిన గొప్ప మేధావి జ్యోతిబా పూలే అని కొనియాడారు. ఆ మహనీయుడి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.



పెద్దపల్లి: నివాళులర్పిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష



జూలపల్లి : బాలరాజ్‌పల్లిలో పూలమాల వేస్తున్న నరసింహంయాదవ్



ధర్మారం: నివాళులర్పిస్తున్న నాయకులు

## పూలేకు ఘన నివాళి

పెద్దపల్లి/ కోల్‌సిటీ, ఏప్రిల్ 11: జిల్లా వ్యాప్తంగా శుక్రవారం మహాత్మా జ్యోతిబా పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు, పార్టీ ఆఫీసులు, కూడళ్ల వద్ద ప్రజాప్రతినిధులు, నాయకులు పూలే విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు పూలే సేవలను కొనియాడారు. ప్రతిఒక్కరూ పూలే ఆశయ సాధనకు కృషిచేయాలని కోరారు. పెద్దపల్లి కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ దాసరి వేణుతో కలిసి కలెక్టర్ కోయ శ్రీ హర్ష.. పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుల్పంచారు. చదువు ప్రాముఖ్యతను చాటిచెప్పిన మహనీయుడు పూలే అని కొనియాడారు. గోదావరిఖనిలో పూలే విగ్రహానికి రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ నివాళులర్పించారు. ప్రతి ఒక్కరూ మహనీయుల అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. అలాగే సీపీఎం గోదావరిఖని పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మార్కండేయ కాలనీలోని నివాళులర్పించారు.

కోల్‌సిటీ, ఏప్రిల్ 11: రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ ఎన్ వెంకటస్వామి నివాళులర్పించారు. ఇక్కడ ఈఈ రామన్, రెవెన్యూ అధికారి ఆంజనేయులు, అకౌంట్స్ ఆఫీసర్ రాజు, సీనియర్ అసిస్టెంట్ పబ్బాల శ్రీనివాస్, హెల్త్ అసిస్టెంట్ కిరణ్, సంపత్, రాజ్‌కుమార్, రవితేజ, విజయలక్ష్మి పాల్గొన్నారు.

జూలపల్లి, ఏప్రిల్ 11: బాలరాజ్‌పల్లిలో మండల మాజీ సర్పంచుల ఫోరం అధ్యక్షుడు నరసింహంయాదవ్ నివాళులర్పించారు. మాజీ వైస్ ఎంపీపీ మొగురం రమేశ్, మాజీ ఎంపీటీసీ సభ్యుల ఫోరం మండలాధ్యక్షుడు వెంకటేశం, జీపీ కార్యదర్శి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

రామగిరి ఏప్రిల్ 11: రామగుండం-3 అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాల ఆధ్వర్యంలో జీఎం కార్యాలయ ప్రాంగణంలో ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏరియా బీసీ లైజన్ ఆఫీసర్ కే చంద్రశేఖర్, గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు రామచంద్ర రెడ్డి, కోట రవీందర్ రెడ్డి, ఏరియా అధికారుల సంఘం అధ్యక్షుడు సీహెచ్ వెంకటరమణ పాల్గొన్నారు.

రామగిరి, ఏప్రిల్ 11: సెంటినరీకాలనీలో మేనేజర్ సుజిత్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆర్జీ-3, ఏపీఏ ఏరియా బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి నాగెల్లి సాంబయ్య, అసిస్టెంట్ ట్రైనింగ్ ఆఫీసర్ శ్రీనివాస్, వీరన్న, సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దపల్లి కమాన్/కాల్వశ్రీరాంపూర్/జ్యోతినగర్, ఏప్రిల్ 11: పెద్దపల్లిలోని ట్రినిటీ బీఈడీ, డీఈడీ ఉపాధ్యాయ శిక్షణ కళాశాలలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే కాల్వశ్రీరాంపూర్ మండలంలో పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. అదే విధంగా రామగుండం అంబేద్కర్‌చౌక్‌లో అంబేద్కర్ సంఘాల నాయకులు నివాళులర్పించారు.

## మద్యానికి బానిసైన కొడుకు..

- తాగొచ్చి కుటుంబసభ్యులతో గొడవ
- క్షణికావేశంలో రొకలిబండతో కొట్టిన తల్లి
- దవాఖానకు తీసుకెళ్తుండగా మృతి



నరేశ్(ఫైల్)

ముత్తారం, ఏప్రిల్ 11: మద్యానికి బానిసైన ఆ కొడుకు.. నిత్యం తాగొచ్చి కుటుంబ సభ్యులతో గొడవ పడేవాడు. ఎంత చెప్పినా వినకపోవడంతో క్షణికావేశంలో ఆ తల్లి రొకలిబండతో కొట్టగా, ఆ కొడుకు దవాఖానకు తీసుకెళ్తుండగా మార్గ మధ్యంలో మృతిచెందా డు. ఈ విషాదకర ఘటన పెద్దపల్లి జిల్లా మండల కేంద్రలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రానికి చెందిన మహేశ్ నరే శ్ (33) ఎనిమిదేండ్ల క్రితం వివాహమైంది. దాదాపు నాలుగేండ్ల కిత్రం భార్యతో విడాకు లు కావడంతో అప్పటి నుంచి తల్లిదండ్రులు రాజయ్య-లక్ష్మి వద్దనే ఉంటున్నాడు. ఈ క్రమం లో నరేశ్ మద్యానికి బానిసయ్యాడు. డబ్బుల కోసం అప్పుడప్పుడు తల్లిదండ్రులతో గొడవపడేవాడు. ఈ క్రమంలో గురువారం రోజున 11:30సమయంలో పుల్లుగా తాగొచ్చి తల్లి దండ్రులతో గొడవపడ్డాడు. గొడవ వద్దని ఎంత చెప్పినా వినకపోవడంతో క్షణికావేశానికి లోనైన తల్లి లక్ష్మి రొకలిబండతో నరేశ్ తలపై కొట్టింది. తీవ్ర గాయాలైన నరేశ్‌ను స్థానికులు పెద్దపల్లి ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. రాజయ్య ఫిర్యాదు మేరకు లక్ష్మిపై కేసు నమోదు చేసినట్లు మంథని సీఐ బీ రాజు తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

HOUSE FOR SALE



★ కమర్షియల్ బిల్డింగ్ అమ్మబడును, కరీంనగర్ విద్యారణ్యపురి రోడ్ నెం-1 లోని ఆర్యన్ హాస్పిటల్ వెనుక బిల్డింగ్ 4 గుంటలు అమ్మబడును. Cont: ఆర్యన్ హాస్పిటల్ నందు సంప్రదించగలరు.
NTK-337576

CHANGE OF NAME

★I Kasetty Rajeshwer (old Name) R/o. 2-2-28, Metpally (M) Jagtial Dist, TS Have Changed name as "Kashetty Rajeshwar Rao" (New Name) S/o Kashetty Narayana. And My wife Kasetty Sandhya Rani (Old name) have Changed " Kashetty Sandhya Rani"
TTK-00000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads



మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 9182 777 571
9182 777 189

### ముగ్గురిపై అట్రాసిటీ కేసు

మంథని రూరల్, ఏప్రిల్ 11: మండలంలోని గోపాల్‌పూర్‌లో కులం పేరుతో దూషించిన ముగ్గురిపై శుక్రవారం మంథని పోలీస్‌స్టేషన్‌లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. గోపాల్‌పూర్‌కు చెందిన గోరిగె జయసుధ వీవోఏగా పని చేస్తుండగా, తనను ఆకారణంగా తొలగించారని పీడీకి ఫిర్యాదు చేశారు. ఈ విషయంలో గ్రామ స్వశక్తి సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి, బహి రంగ విచారణ చేపట్టాలని మండల సమాఖ్య సభ్యులను ఆదేశించగా, శుక్రవారం మధ్యాహ్నం 1.30 గంటల ప్రాంతంలో వారు జయసుధకు, గ్రూప్ సభ్యులకు సమాచారం లేకుండా ఊరి బయట సమావేశమయ్యారు. ఈ విషయం తెలిసిన జయసుధ, ఎరుకల సమ్మక్కలు సమావేశం దగ్గరికి వెళ్లి పంచాయతీ వద్ద సమావేశం నిర్వహించాలని సభ్యులకు తెలుపగా సభ్యులంతా పంచాయతీ వస్తుండగా సమావేశాన్ని చెదరగొట్టారంటూ కొత్త వీవో అధ్యక్షురాలు లక్కం సరిత, తల్లి దాసరి బుజ్జమ్మ, దాసరి రమాదేవి కులం పేరుతో జయసుధ, సమ్మక్కలను బూతులతో, కులం పేరుతో దూషించారు. ఈ మేరకు జయసుధ మంథని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, లక్కం సరిత, దాసరి బుజ్జమ్మ, దాసరి రమాదేవిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు.

### ఎంపీ అర్వింద్ విమర్శలు విడ్డూరం

**ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

ధర్మారం, ఏప్రిల్11: నిజామాబాద్ జిల్లాకే ఏమి చేయని అక్కడి ఎంపీ ధర్మపురి అర్వింద్ తమ ప్రభుత్వంపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ విమర్శించారు. శుక్రవారం లక్ష్మణ్ కుమార్ ధర్మారం మండలంలో పర్యటించారు. ఖిలా వనపర్తి గ్రామంలోని శ్రీలక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం ధర్మకర్త మండలి సభ్యుల పదవీ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరు కాగా, దేవాదాయ ధర్మాదాయ శాఖ ఈవో కాంతారెడ్డి కమిటీ చైర్మన్ పోలుదాసరి సంతోష్‌తో పాటు సభ్యులచే ప్రమాణం చేయించారు. అనంతరం నర్సింహులపల్లిలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్,దేవాదాయ శాఖ ఈవో కాంతారెడ్డి,నంది మేడారం ప్యాక్స్ చైర్మన్ ముత్యాల బలరాంరెడ్డి, తహసీల్దార్ ఎండి వకీల్,శ్రీలక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ పోలుదాసరి సంతోష్,సభ్యులు,ఏఎంసీ చైర్మన్ లావుడ్యా రూప్లా నాయక్,వైస్ చైర్మన్ అరిగె లింగయ్య, డైరెక్టర్లు,కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతి రెడ్డి,నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు అశోద అజయ్, మండల యూత్ అధ్యక్షుడు తిరుపతి,మాజీ ఎంపీపీ హన్మయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ కొత్త నర్సింహం తదితరులు పాల్గొన్నారు.

### 30లోపు దరఖాస్తుల ఫీల్డ్ వెరిఫికేషన్ పూర్తి చేయాలి

పెద్దపల్లి, ఏప్రిల్ 11 : ఈనెలాఖరు లోగా రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల ఫీల్డ్ వెరిఫికేషన్ పూర్తి చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో రాజీవ్ యువ వికాసంపై అదనపు కలెక్టర్ అరుణ శ్రీతో కలిసి కలెక్టర్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ నెల 14 వరకు రాజీవ్ యువ వికాసం దరఖాస్తులు స్వీకరించి, 30లోపు పరిశీలన పూర్తి చేయాలన్నారు. జడ్పీ సీఈవో నరేందర్, సీపీవో రవీందర్, లీడ్ బ్యాంక్ మేనేజర్ వెంకటేశ్, డీపీవో వీర బుచ్చయ్య, జిల్లా బీసీ అభివృద్ధి అధికారి జే రంగా రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

### మరణించి.. మరో ఇద్దరికి చూపు ప్రసాదించి..

కోల్‌సిటీ, ఏప్రిల్ 11: తాను మరణించినా.. అతని కళ్లు మాత్రం ఈ లోకంను చూస్తున్నాయి. మరో ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించాడు గోదావరిఖని మార్కండేయ కాలనీకి చెందిన సామాజిక సేవకుడు, జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు, చేయూత ఫౌండేషన్ ఫర్ ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ వ్యవస్థాపకుడు, యోగా గురువు నీలం ఐల య్య (48) శుక్రవారం మృతి చెందాడు. దీంతో కుటుంబ సభ్యులు ఐలయ్య నేత్రాలను దానం చేసి ఆదర్శంగా నిలిచారు. కాగా, సదాశయ ఫౌండేషన్ విజ్ఞప్తి మేరకు కుటుంబ సభ్యులు ఐలయ్య నేత్రాలను దానం చేశారు. ఎల్‌వీ ప్రసాద్ ఐ బ్యాంక్ టెక్నిషియన్ ప్రదీప్‌చే నేత్రాలను సేకరించి హైదరాబాద్‌కు తరలించారు. ఐలయ్య మృతి పట్ల ఫౌండేషన్ సభ్యులు శ్రవణ్‌కుమార్, లింగమూర్తి, కేవీస్ వాసు, లయన్స్ క్లబ్ సభ్యులు మల్లికార్జున్, విజయలక్ష్మి, సదాశయ మహిళా అధ్యక్షురాలు కవిత అనంత రాములు ప్రగాఢ సంతాపం తెలిపారు. నేత్రదానం చేసిన కుటుంబ సభ్యులను అభినందించారు.

### రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల గడువు పెంచాలి

కోల్‌సిటీ, ఏప్రిల్ 11: నిరుద్యోగులకు రాయితీ రుణాల కోసం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకంకు దరఖాస్తుల గడువు పెంచాలని తెలంగాణ రక్షణ సమితి (డెమోక్రటిక్) పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు వాసంపల్లి ఆనంద్ బాబు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ నెల 14వ తేదీతో దరఖాస్తుల గడువు ముగియనుందని, ఐతే మూడు రోజులు వరుసగా సెలవులు రావడంతో చాలా మంది దరఖాస్తు చేసుకునే అవకాశం కోల్పోతున్నారని పేర్కొన్నారు.

### ఉపాధి కూలీలకు షీ టీం, సైబర్ క్రైంపై అవగాహన

పాలకుర్తి, ఏప్రిల్11: మండలంలోని కన్నాల గ్రామంలో ఉపాధిహామీ కూలీలకు షీటీమ్స్, సైబర్ క్రైంపై సీటీం ఇన్‌చార్జి ఎస్ఐ లావణ్య శుక్రవారం అవగాహన కల్పించారు. మహిళల భద్రత, యాంటీ డ్రగ్స్‌పై మహిళలు అవగాహన కలిగి ఉండాలని, మీ ఇంట్లో పిల్లలను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ఎవరైనా వేధింపులకు గురిచేస్తే భయపడకుండా ఫోన్ నంబర్ 6303923700కు ఫోన్ చేసి, సమస్య తెలుపాలన్నారు. కార్యక్రమంలో షీటీం సభ్యులు స్నేహలత, మౌనిక, సురేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### గుండెపోటుతో అడ్వొకేట్ మృతి

ఓదెల, ఏప్రిల్ 11: శానగొండ గ్రామానికి చెందిన అడ్వకేట్ వేపూరి తిరుపతి గౌడ్ గురువారం అర్ధరాత్రి గుండెపోటుతో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. తిరుపతిగౌడ్ సుల్తానాబాద్ కోర్టులో అడ్వొకేట్‌గా పని చేస్తున్నాడు. రాత్రి వేళ అస్వస్థతకు గురై చాతిలో నొప్పి వస్తుండడంతో కుటుంబ సభ్యులు దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందినట్లు పేర్కొన్నారు. శానగొండ గ్రామానికి సుల్తానాబాద్ జూనియర్ సివిల్ జడ్జి గణేశ్, సెకండ్ క్లాస్ జడ్జి శంకర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మేకల తిరుపతిరెడ్డి, పలువురు అడ్వకేట్లు వచ్చి తిరుపతిగౌడ్‌కు శ్రద్ధాంజలి ఘటించారు.

### సమస్యల పరిష్కారం కోసం పోరాడాలి

సుల్తానాబాద్, ఏప్రిల్ 11 : పలు రైస్‌మిల్లుల్లో పనిచేస్తున్న గుమాస్తాల సమస్య ల పరిష్కారం కోసం పోరాడాలని జిల్లా సీఐటీయూ కార్యదర్శి ఎరవెల్లి ముత్యం రావు అన్నారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని పూసాల పెద్దమ్మగుడి వద్ద సుల్తానాబాద్ రైస్‌మిల్ గుమాస్తాల సంఘం సర్వసభ్య సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ముత్యంరావు మాట్లాడుతూ గుమాస్తాల కనీస వేతనం, వారంతపు సెలవు, పిఎఫ్, ఈఎస్ఐ, బోనస్, పనిగంటలు తదితర చట్టబద్ధమైన సౌకర్యాలు అమలు కాకుండా అనేక సమస్యలతో బాధపడుతున్నారనీ, సమస్యల పరిష్కారం కోసం గుమాస్తాలు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపినిచ్చారు. అంతకుముందు మహాత్మా జ్యోతిరావు పూలే 198వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిఐటియూ మండల కన్వీనర్ తాండ్ర అంజయ్య, పురం హరికిషన్‌రావు, కందుకూరి భగవాన్, వేగోళం శంకర్‌గౌడ్, ఉస్తేం వినయ్, పెగడ కిషన్, వేగోళం శ్రీధర్, శ్రీనివాస్, పొచవేని బాలు, సంపత్, అనిల్, శ్రీకాంత్, అఖిల్ ఉన్నారు.

### సెలవు రోజుల్లో దరఖాస్తుల స్వీకరణ

రామగిరి, ఏప్రిల్ 11: రాజీవ్ యువ వికాసం రాయితీ రుణాల కోసం సెలవు దినాల్లో కూడా దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని రామగిరి మండల ఎంపీడీవో శైలజారాణి తెలిపారు. వరుసగా మూడు రోజులు వస్తున్నందున నిరుద్యోగులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదనీ, మండల పరిషత్ కార్యాలయంలో సెలవు రోజులో కూడా దరఖాస్తులు యథావిధిగా స్వీకరిస్తారని తెలిపారు.

### రాములపల్లిలో ఒకరి అరెస్ట్

ఎలిగేడు ఎప్రిల్ 11 : మండలం లోని రాములపల్లి లో గురువారం జరిగిన బాలిక పై లైంగిక దాడియత్నంపై తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ సనత్ కుమార్ గ్రామంలో విచారణ నిర్వహించారు. పలువురి వాగ్మూలం సేకరనలో భాగంగా నిందితుడి సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకొని, నవదీప్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

### వక్ఫ్ చట్టాన్ని రద్దు చేయాలి

కోల్‌సిటీ, ఏప్రిల్ 11: వక్ఫ్ చట్టంను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ముస్లిం నాయకులు శుక్రవారం రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అంతకుముందు బైక్ ర్యాలీగా నగర పాలక కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం నిరసన తెలిపారు. భారత రాజ్యాంగంకు విరుద్ధంగా ఆర్టికల్ 26కు వ్యతిరేకంగా బీజేపీ ప్రభుత్వం ఈ నల్ల చట్టంను తీసుకవచ్చిందని ఆరోపించారు. మత స్వేచ్ఛగా భంగం కలిగించేలా తెచ్చిన ఈ చట్టంను రద్దు చేయాలని కోరుతూ సుప్రీం కోర్టులో కేసు విచారణలో ఉందని, తమకు అనుకూలంగా తీర్పు వస్తుందన్న నమ్మకం ఉందన్నారు.

### అంబేద్కర్ జయంతి వేడుకలపై జీఎం సమీక్ష

గోదావరిఖని, ఏప్రిల్ 11: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలపై ఆర్జీ-1 జీఎం లలిత్‌కుమార్ శుక్రవారం స్థానిక జీఎం కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులతో సమీక్ష నిర్వహించారు. జీఎం కార్యాలయం వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాల ఆవిష్కరణ కార్యక్రమానికి సంబంధించి డెకరేషన్, లైటింగ్, షామియానాలు, తాగునీటి వసతి, మైక్‌సెట్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇక్కడ ఎస్ఓటు జీఎం గోపాల్‌సింగ్, ఏరియా ఇంజినీర్ డీవి రావు, డీజీఎం ఏరియా వర్కుషాపు, జితేందర్‌సింగ్, డీజీఎం పర్సనల్ కిరణ్‌బాబు, వరప్రసాద్, కోల మల్లేశ్, బీసీ లైజన్ పీ శ్రీనివాస్, ఆంజనేయప్రసాద్, పీవో హన్మంతరావు, సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ వీరారెడ్డి, ఎస్‌సి లైజన్ ఆఫీసర్ డీ వెంకటేశ్వర్లు, నాయకులు ఈర్ల రాజేశ్, నర్సయ్య, మోహన్, లింగమూర్తి, రాంచందర్, హరీశ్, శ్రీనివాసరావు ఉన్నారు.

### అంగన్‌వాడీలో పిల్లలకు పౌష్టికాహారం అందించాలి

సుల్తానాబాద్, ఏప్రిల్ 11 : అంగన్‌వాడీల ద్వారా పిల్లలకు పౌష్టికాహారం అందించాలని మున్సిపల్ కమిషనర్ మహ్మద్ నియాజ్ సూచించారు. శుక్రవారం సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి పిల్లలకు అందిస్తున్న అహారంపై అడిగి తెలుసుకున్నారు. వయస్సు పిల్లలకు అల్పాహారం అందించి పిల్లల ఆరోగ్యంగా ఎదిగేలా సహకారం అందించాలన్నారు.

### అంగన్‌వాడీలో కేంద్రాల్లో చిన్నారుల ఎత్తు, బరువు కొలతలు

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 11: కలెక్టర్ కోయశ్రీహర్ష ఆదేశాల మేరకు జిల్లాలోని పెద్దపల్లి, రామగుండం, మంథని ప్రాజెక్టుల పరిధిలోని 750 అంగన్ వాడీ కేంద్రాల్లో శుక్రవారం చిన్నారుల ఎత్తు, బరువు కొలతలను తీసుకున్నారు. జిల్లా సంక్షేమ శాక అధికారి వేణుగోపాల్ పర్యవేక్షణలో అంగన్‌వాడీ కేంద్రాల్లో అంగన్‌వాడీ టీచర్‌లు, ఆయాలు చిన్నారుల ఎత్తు, బరువు, జబ్బ కొలతలను తీసుకుని రికార్డు చేసుకున్నారు. పెద్దపల్లి మండలంలోని అప్పన్నపేట అంగన్ వాడీ కేంద్రంలో చిన్నారులకు తీస్తున్న కొలత కార్యక్రమాన్ని పెద్దపల్లి ఎంపీడీవో సందర్శించి పరిశీలించారు. కార్యక్రమంలో సీడీపీవోలు, సూపర్‌వైజర్‌లు, అంగన్ వాడీ టీచర్లు పాల్గొన్నారు.

### కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

జ్యోతినగర్, ఏప్రిల్ 11: కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తామని ఎన్టీపీసీకి చెందిన ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షుడు భూమల్ల చందర్ పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన చందర్ ఈ మేరకు శుక్రవారం ఎన్టీపీసీ టౌన్‌షిప్‌లోని ఎన్టీపీసీ మజ్దూర్ యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రామగుండం రీజియన్ కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ కన్‌స్ట్రక్షన్ లేబర్ యూనియన్ ప్రధానకార్యదర్శి, ఐఎన్టీయూసీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా సంయుక్త కార్యదర్శిగా కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారానికి బాధ్యతాయుతంగా చేస్తున్న కృషికి గాను గురువారం ఐఎన్టీయూసీ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి జిల్లా అధ్యక్షుడిగా నియామకపు పత్రం అందజేయడం అభినందనీయమన్నారు. జిల్లా అధ్యక్ష పదవితో తనపై మరింత బాధ్యత పెరిగిందని, శక్తివంచన లేకుండా సమస్యల సాధన, యూనియన్ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు. ఇక్కడ ఎన్టీపీసీ మజ్దూర్ యూనియన్ నాయకులు రాజేశ్వర్, కృష్ణయ్యతో పాటు రీజియన్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఉపాధ్యాక్షులు ఎండీ జమీల్, శ్రీనివాస్, కార్యదర్శి గోశిక రవి ఉన్నారు.

### మండల కేంద్రంలో వీధిదీపాలు కరువు

పాలకుర్తి, ఏప్రిల్11: మండల కేంద్రంలో ప్రధానరహ దారిపై వీధి దీపాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని మండల బీఆర్ఎస్ నాయకుడు మాదాసు అరవింద్ ఎంపీడీవోకు వినతిపత్రం శుక్రవారం అందజేశారు. బసంత్‌నగర్ నుంచి పాలకుర్తి వరకు ప్రధానరహదారికి ఇరువైపులా వీధిదీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. రాత్రివేలలో రైతులు, అల్ట్రాటెక్ సిమెంట్ కర్మాగారం ఉద్యోగులు ఈ రహదారి వెంట వెళ్లుతారని, వీధి దీపాలు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వెంటనే అధికారులు స్పందించి, వీదదీపాలు ఏర్పాటుచేయాలని కోరారు.

### హైదరాబాద్‌లో సింగరేణి సూపర్ స్పెషాలిటీ దవాఖాన

గోదావరిఖని, ఏప్రిల్ 11: సింగరేణి కార్మికుల ఆరోగ్య భద్రతను దృష్టిలో పెట్టుకొని హైదరాబాద్‌లో ప్రత్యేకంగా సింగరేణి ఉద్యోగులు, రిటైర్డు కార్మికుల కోసం యాజమాన్యం సూపర్ స్పెషాలిటీ దవాఖాన ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు తెలిసింది. ప్రతి రోజు దాదాపు వందమందికిపైగా కార్మికులు మెరుగైన వైద్యం కోసం ప్రవేట్ దవాఖానలకు రెఫర్ చేయడంతో సంస్థకు భారీగా ఆర్థిక భారంతో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ బీ జనక్‌ప్రసాద్ సింగరేణి సీఎండీ, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్కమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకెళ్లి పలుమార్లు విన్నపించగా, అధికార యంత్రాంగం హైదరాబాద్‌లో కొత్తగా సింగరేణి సూపర్ స్పెషాలిటీ దవాఖాన ఏర్పాటుకు అనుమతి మంజూరు చేసింది.

### పత్తి క్వింటాలు @ రూ.7458

పెద్దపల్లి, ఏప్రిల్ 11: పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో క్వింటాలు పత్తి గరిష్ఠ ధర రూ.7458 పలికింది. 39 మంది రైతులు 154 సంచుల్లో తీసుకవచ్చిన 169 క్వింటాళ్ల పత్తిని ప్రైవేట్ వ్యాపారులు కొనుగోలు చేయగా, కనిష్ఠంగా రూ. 5608, గరిష్ఠంగా రూ. 7458, సగటు రూ.7231 లభించిందని కార్యదర్శి మనోహర్ తెలిపారు.

### అటెండర్ సస్పెన్షన్

పెద్దపల్లి, ఏప్రిల్ 11 : పెద్దపల్లి మున్సిపాలిటీలో పనిచేస్తున్న అటెండర్ పోల రమేశ్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ కోయ శ్రీహర్ష ఉత్తర్వులు జారీ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రమేశ్ ఎలాంటి సమాచారం ఇవ్వకుండా గత నవంబర్ 1 నుంచి విధులకు గైర్హాజరు అయ్యాడని, వివరణ కోరుతూ పలుసార్లు మెమోలు జారీ చేసినప్పటికీ ఎలాంటి వివరణ సమర్పించలేదని చెప్పారు. క్రమ శిక్షణ చర్యల్లో భాగంగా విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు వెల్లడించారు.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అంతర్గాం, ఏప్రిల్ 11: మండలంలో శనివారం మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ శంకర్ తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

సుల్తానాబాద్ రూరల్, ఏప్రిల్ 11: నారాయణపూర్‌లో ఉదయం 9 నుంచి 11గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ కిశోర్ తెలిపారు.

ముత్తారం, ఎప్రిల్ 11: ముత్తారం, ఖమ్మంపల్లి సబ్ స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 9.30 నుంచి 12.00 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈఈ సంతోష్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

### జేఎన్‌టీయూలో ప్రొఫెసర్ల ర్యాలీ

రామగిరి, ఏప్రిల్ 11: స్థానిక మంథని జేఎన్‌టీయూలో కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు ర్యాలీ తీశారు. మూడు రోజులుగా రాష్ట్రంలోని 12 విశ్వ విద్యాలయాల్లో జరుగుతున్న నిరసన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఇక్కడి జేఎన్‌టీయూ కళాశాలలో ర్యాలీ నిర్వహించారు. జీవోనం.21ను వ్యతిరేకిస్తూ ఉద్యోగ భద్రతతో కూడి పేస్కేల్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

### శ్రీచైతన్యలో ట్రెడిషనల్ డే

ఫర్టిలైజర్‌సిటీ, ఏప్రిల్ 11: గోదావరిఖనిలోని శ్రీ చైతన్య డిగ్రీ, పీజీ కళాశాలలో శుక్రవారం ట్రెడిషనల్‌డేను విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. ఇక్కడ కళాశాల కరస్పాండెంట్ సత్యనారాయణరెడ్డి, ప్రిన్సిపాల్ టీ యాకాంతం, వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్ రమేశ్, ఉపాధ్యాయులు ఉన్నారు.

### తహసీల్దార్ ఎదుట బైండోవర్

ధర్మారం, ఏప్రిల్11: పలువురు రౌడీ షీటర్లను శుక్రవారం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు స్థానిక ఎస్ఐ శీలం లక్ష్మణ్ తెలిపారు. బైండోవర్ అయిన వారు సత్ప్రవర్తనతో ఉండాలని వారిని బైండోవర్ చేసినట్టు ఆయన వివరించారు.